# పుస్తక పరిచయం




*Writer:*
**PSM Lakshmi**
B – 391 Srikrishna Nagar
HYDERABAD - 500 045
Phone: 9866001629

*Distributed by:*
Visalandhra Publishing House
Navodaya Book House
Sahityabharati Book Shop
Kinige.com

**ఆంధ్రదేశంలోని** ప్రతి ఊరిలోనూ కనీసం ఒకటైనా దేవాలయం ఉంటుంది. పట్టణాల్లో, నగరాల్లో ఐతే డజన్ల కొద్దీ దేవాలయాలు ఉన్నాయి. వీటిల్లో అధికశాతం కొన్ని శతాబ్దాల పూర్వం నిర్మించబడినవే. ప్రతి దేవాలయానికీ ఒక స్థలపురాణం ఉంటుంది. కొన్ని అధికప్రచారంలో ఉన్నా, ఎక్కువశాతం దేవాలయాలకి సంబంధించిన చరిత్రలు ఏ పుస్తకాల్లోనూ ఉండవు. ఆనోటా ఆనోటా ప్రచారంలో నిలుస్తాయంతే. ఏదో దూరప్రాంతాలకి వెళ్ళేప్పుడు ఏ రహదారి పక్కనో, అడవుల్లోనో, కొండగుట్టమీదో ఏదో చిన్న దేవాలయం కనిపిస్తుంది. నమ్మకం ఉన్నవాళ్ళు అక్కడికి వెళ్ళి దణ్ణం పెట్టుకుని వస్తారు. దాని చరిత్ర చెప్పేవాళ్ళు ఎక్కడ ఎవరూ ఉండకపోవచ్చు. ఇలాంటి నేపథ్యంలో రచయిత్రి పి.ఎస్.ఎమ్. లక్ష్మిగారు నల్గొండలోని పుణ్యక్షేత్రాలగురించి, వరంగల్ జిల్లాలోని పుణ్యక్షేత్రాల గురించి లోగడ రెండు పుస్తకాలని వెలువరించారు. ఆ కోవలో మూడవ పుస్తకం ఈ యాత్రాదీపిక. ఇందులో హైదరాబాదు నుంచీ ఒక్క రోజులో వెళ్ళి చూసిరాగల పరిధిలో ఉన్న 72 ఆలయాల గురించిన సమగ్ర సమాచారం ఉంది. ఇలాంటి పుస్తకాల్లో సహజంగా దేవాలయాల గురించిన వివరణ ఉంటుంది కానీ లక్ష్మిగారు వ్రాసిన మిగతా పుస్తకాల లాగానే ఇందులో కూడా ప్రతి ప్రదేశానికి ఎలా వెళ్ళొచ్చో కూడా వివరంగా వ్రాశారు. వెళ్ళే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గమనికలు ప్రతి చిన్న విషయాన్నీ ప్రాక్టికల్‌గా ఉపయోగపడేలా వ్రాశారు. రచనా శైలి సరళంగా, సులభంగా ఎవరో మిత్రులు పక్కన కూర్చుని వివరిస్తున్నట్లుంటుంది. కొన్నికొన్ని దేవాలయాల విషయాల్లో ప్రచారంలో ఉన్న చిన్నచిన్న కథలు కూడా పేర్కొన్నారు. దైవభక్తితో ఈ దేవాలయాలని సందర్శించాలనుకున్న వారికి ఈ పుస్తకం చక్కటి గైడ్‌లా ఉపయోగపడుతుంది. పురాతన వైభవాల దృష్టిలో చూసినా ఇలాంటి ప్రదేశాల సందర్శన ఆసక్తికరంగా ఉంటుంది. చరిత్రలో మరుగున పడిన సంఘటనల గురించి తెలుసుకునే అవకాశం కలిపిస్తుంది. లక్ష్మిగారు చేస్తున్న ఈ యాత్రాదర్శిని ప్రణాళికలు అభినందనీయం. అరుదుగా లభ్యమయ్యే వివరాలని, స్వానుభవాలని అందరికీ ఉపయోగపడే రీతిలో గ్రంథస్తం చేస్తున్న వారి కృషి పదికాలాలు నిలిచిపోతుంది.

***




**_Publishers:_**
**Bhuvana Vijayam, Melbourne**
PO Box: 1161, Balckburn North
VIC 3130, Australia
melbotelugusahiti@yahoogroups.com

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**

**ఆస్ట్రేలియాలోని** వివిధ నగరాల్లో నివసించే తెలుగువారి రచనల సంకలనం ఈ కవితాస్త్రాలయ-2014. పేరులో కవితాస్త్రం అని ఉన్నా నిజానికి ఈ 300 పేజీల పుస్తకంలో అన్ని సాహిత్యప్రక్రియలూ చోటుచేసుకున్నాయి. అన్నింటికీ అంతర్గత సూత్రం ఆస్ట్రేలియాలో నివసించే తెలుగువారి గుండెచప్పుళ్ళు, వారి కలం కదలికలు. అన్ని విదేశాల్లోలాగానే ఆస్ట్రేలియాలో కూడా చాలా దశాబ్దాలుగా తెలుగువారు నివసిస్తున్నారు. ఆ దేశంలోని అన్ని విభాగాల్లో విశిష్టసేవలందిస్తూ తమ ప్రత్యేకతని నిలబెట్టుకుంటున్నారు. గౌరవాన్ని పొందుతున్నారు. అన్ని రంగాల్లోలాగానే తమ సంస్కృతీ వారసత్వాన్ని నిలబెట్టుకుంటూ మెల్‌బోర్న్ నగరంలో భువనవిజయం అనే సాహితీ సంస్కృతీ సంవేదికని నిర్వహిస్తున్నారు. దాని సంచాలకులు మల్లికేశ్వరరావు కొంచాడగారి ఆధ్వర్యంలో 2010 లో మొదటిసారిగా 'కవితాస్త్రాలయ' అనే రచనా సంకలనాన్ని ప్రచురించారు. దానికి లభించిన విశేష ఆదరణని పురస్కరించుకుని ఈ సంవత్సరంలో కూడా కవితాస్త్రాలయ-2014 (ఆస్ట్రేలియా సాహితీ సుగంధాలు) అనే ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, కాన్‌బెర్రా, పెర్త్ లాంటి వివిధ నగరాలనుంచి తెలుగు రచయితలు తమ రచనలతో ఈ పుస్తకాన్ని సుసంపన్నం చేశారు. సాహితీ ప్రక్రియని బట్టి కాక అంశాన్ని బట్టి ఇందులోని రచనలని 13 విభాగాలుగా తీర్చిదిద్దారు. ప్రతి అధ్యాయానికీ ప్రముఖ చిత్రకారులు బాలిగారు చక్కటి అధ్యాయ చిత్రాన్ని వేశారు. ఇందులోని కొన్ని విభాగాలు: తెలుగు తల్లికి మల్లెపూదండ , తెలుగు వైభవం, మా తెలుగు పల్లె, మన పండుగలు, కాలవాహిని, సుభాషితాలు.. వగైరా. ప్రతి విభాగంలోనూ కథలూ, కవితలూ, వ్యాసాలూ, విశ్లేషణలూ, నాటికలూ.. ఉన్నాయి. పుస్తకం చివరలో ప్రచురించిన రచయిత(త్రు)ల పరిచయాలు చదువుతుంటే ఒక్కసారి ఆస్ట్రేలియాలో తెలుగువారి విస్తృతి, వైభవం, చరిత్ర తెలుసుకున్నట్లుంటుంది. చక్కటి ముద్రణ, తనికెళ్ళ భరణి లాంటి సాహితీవేత్తల పరిచయవాక్యాలు ఈ పుస్తకాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాయి. ఆస్ట్రేలియా తెలుగు రచయితల ఈ కృషి అక్కడి ముందు తరాలకి మార్గదర్శి కావాలని, వారి నుంచి ఇటువంటి సంకలనాలు మరిన్ని రావాలని ఆశిద్దాం. ***